

# పిరికివాడు

ప్రకాశరావు

ఢిల్లీ వెళ్ళి ఇంటర్వ్యూ తంతు ముగిసిన తరవాత దగ్గర్లోనే హరిద్వార్, ఋషికేశ్ కూడా వెళ్ళివద్దామంటే మా రామం ససేమిరా రానన్నాడు. మావాడు హరిద్వార్‌లో ఇంతకుముందు కొన్నాళ్ళ వుద్యోగం వెలగబెట్టి వున్నట్టుండి రిజైన్ చేసి ఇంటిమొహం పట్టాడు. మళ్ళీ చాలారోజుల తరవాత ఇటుగా వచ్చిన వాడు దగ్గర్లోనే వున్న హరిద్వార్‌కు వెళ్లాలంటే మొండికేయడం కాస్తవింతగా అనిపించింది నాకు. వాడి మొండితనానికి విసుగెత్తినా కొత్తచోట తెలిసినవాడు కూడా వుంటే ప్రయాణం సులువని వాడిని బతిమాలి బయల్దేరదీసేసరికి నిజంగానే హరిహరాదులు దిగివచ్చారు.

హరికీ పావురీ (హర్ కీ పావురీః)లో స్నానంచేసి పవిత్రత సంతరించుకున్న తరవాత బస్సెక్కి ఋషికేశ్ వెళ్ళి ఆంధ్ర ఆశ్రమంలో గదితీసుకుని దిగాం. ఆశ్రమం బ్రహ్మాండంగా వుంది—ప్రత్యేకించి కొత్తగా కట్టిన రెండు దేవాలయాలు ఆ పరిసరాల్లో కొట్టవచ్చినట్టుగా కనిపిస్తాయి మర్నాడు టాంగా తీసుకుని లక్ష్మణ్ ఝూలా వెళ్లాం.

ఇటు కొండ మీదా అటు కొండ మీదా ఉక్కు టవర్ల మీదుగా ఇనుపతాళ్ళ

బిగించి వాటికి ఇనుప తీగలు వేళ్లాడదీసి ఉయ్యాల మాదిరిగా వంతెన తయారు చేశారు. గాలికి వూరికే ఊగిపోకుండా ఇటూ అటూ బిగించి మరీ కట్టారు. అయినా దాని మీదుగా నడుస్తూంటే కొంత భయంగానే వుంటుంది. మెలికలు తిరుగుతూ గంగానది నిండుగా, వేగంగా, ఠంయిమని రెండువేపులా కొండలను ఒరుసుకుంటూ పారుతూంటే ఎంత ఆహ్లాదంగా వున్నా ఆ వంతెననుండి కిందికి చూస్తే కళ్లు తిరిగినట్టుగా అనిపించింది నాకు కాస్సేపు.


నెమ్మదిగా వంతెన మీదుగా ఆ మనోజ్ఞ పరిసరాలను చూస్తూ నడుస్తూంటే నాకు ప్రక్కనే రామం వున్న విషయం కూడా గుర్తుకు లేదు. పక్కకు తిరిగి చూస్తే ఎప్పుడూ సరదాగా వుండేవాడు గంభీరంగా ఎటో చూస్తూ పరధ్యానంగా నడుస్తున్నాడు. వాడి ధోరణి గమ్మత్తుగా వుంది నాకు భుజంమీద చరిచిందాకా నా వేపు కూడా చూడలేదు వాడు.

"ఫోటో దిగుతారా?" అంటూ వచ్చిన ఫోటోగ్రాఫర్లను తప్పుకుని వాడిని నిలదీశాను.

"ఓ కథ చెబుతాను వింటావా రఘూ." హఠాత్తుగా అన్నాడు రామం ఇనుప తాళ్లమీదుగా వంగి నదిని పరికించి చూస్తూ. "కొన్ని సంఘటనలు వింతగా అనిపిస్తాయి. నమ్మశక్యంగా కూడా వుండవు. క్షణికోద్రేకాలే కారణం అని సరిపెట్టుకోవడానికి మనసొప్పదు. నేను చెప్పేది ఒక చిన్న సంఘటన. వీలైనంత టూకీగా చెబుతాను వర్ణనలూ...బలమైన ఉపోద్ఘాతమూ, ఉత్కంఠ రేకెత్తించే శైలీ నాకు చేతకావు... క్రింద ప్రవహించే గంగానది చూడు— ఎంత స్వచ్ఛంగా, పవిత్రంగా కనిపిస్తూందో! ఆ గలగలల్లో ఎన్ని కథలు దాగి వున్నాయో ఎవరికి తెలుసు?"

"...రోజూ వందలకొద్దీ యాత్రికులు దాటుతుంటారు ఈ వంతెనను. పుణ్యాభిలాషతో కొందరు వస్తే సరదాగా పిక్నిక్కని మరికొందరు విలాసంగా వస్తారు.

—ఆరోజు అచ్చెరలాటి ఓ చిన్నదీ, మరో ప్రౌఢా— బహుశ తల్లి అయివుంటుంది, వంతెన మీదుగా నడుస్తున్నారు. ఎంతటి ఋష్యశృంగుడికైనా కన్ను చెదిరే లావణ్యమయి ఆ ముగ్ధరాలు. సన్నగా, పొడుగ్గా, మత్తెక్కించే వంపుల సోయగాలతో మెత్తగా నడుస్తుంటే ఎదురుగా వస్తున్న ఓ యువకుల గుంపు నోరు తెరుచుకుని చూస్తూ వుండిపోయింది. సంపెంగలాటి చక్కనిముక్కుకు ఇటూ అటూ రెపరెపలాడే విశాల నేత్రాలూ, గుండ్రటి చుబుకానికి చక్కగా అమరిన లేత గులాబీ పెదాలూ; మెరుగెక్కిన పాలరాతి లాటి నున్నటి చెక్కిళ్లూ, బంగారు వన్నెను వెక్కిరించే దేహచ్ఛాయకు మెరుగుపెట్టే నల్లటి



## పో లి క లు

కురులూ— ఒక్క ముక్కలో చెప్పా లంటే దివినుండి దిగిన దేవకన్యలావుంది కాని మానవ కాంత అనిపించదు!

"ఏమాత్రం తొట్రుపాటూ, తొందరా లేకుండా కదిలిపోతున్న ఆ కోమలాంగిని చూస్తూ అలాగే నుంచునిపోయా రా యువకులంతా. అలా వాళ్లను దాటుకుని పోతూన్న అప్సరవేపు చూస్తూ ఆ గుంపులో ఒకడన్నాడు, 'ఇలాటి సుందరి ఆజ్ఞాపిస్తే ఏదేనా చేయవచ్చు... ఈ వంతెన మీదుగా దూకమన్నా సరే!'

"ఈ మాటలు వినగానే తక్కున వెనక్కు తిరిగింది ఆ తరుణి, 'ఎవరు ఈ మాటలంది?' వీణా తంత్రుల మృదుత్వంతోబాటు సవాలుచేస్తున్న హేళన కూడా వుంది ఆ కంఠస్వరంలో. ఈ హఠాత్సంఘటనకు బ్రాన్పడిపోయారు వాళ్లంతా. ఎవరూ నోరువిప్పి మాట్లాడ లేదు. అందరినీ తేరిపార చూసి నిరసనగా నవ్వింది ఆ సుందరి. ఆవిడ మళ్లీ నవ్వి వెనుదిరిగేంతలో ఆ గుంపులో ఒకడన్నాడు, 'నే నన్నాను'.

సూటిగా అతడివేపు చూస్తూ అడిగింది ఆరూపసి 'నీవేనా నదిలోదూక మంటే దూకుతానన్నావు?'

'అవును' దృఢంగా పలికింది అతని కంఠం.

'మరైతే దూకు' వెటకారంగా అంది ఆ లతాంగి.

"మరు క్షణంలోనే ఎవరూ అనుకోని ఘోరం?— ఆమె వెనుతిరిగే లోగా ఆ యువకుడు అమాంతంగా కిందికి దూకడమేమిటి, రంయిమని పారే గంగామాతకు పారాణి రాస్తూ కొట్టుకు పోవడమేమిటి—

క్షణంలో జరిగిపోయాయి. అంతా వెర్రి వాళ్లలా చూస్తూ వుండిపోయారు. ఇలా అవుతుందని ఎవరూ వూహించి కూడా వుండరు." కాస్సేపు వూపిరి తీసుకోవటానికి ఆగాడు రామం.

"ఇదంతా కథలావుంది కదూ నీకు?" రామం మళ్ళీ మొదలెట్టాడు "కాని అది ఇంతటితో ఆగిపోలేదు. అలా అంతా పిచ్చివాళ్లలా కిందికి చూస్తూన్నంతలో మరో ఘోరం— ఆమె కూడా సరిగా అదే చోటికి దూకేసింది? ఇద్దరినీ ఒళ్లోకి తీసుకుని పరవళ్ళు తొక్కుతూ ఏమీ ఎరగనట్టుగా పారుతూంది గంగానది మరో క్షణంలోనే..."

నరాల్లోంచి విద్యుత్తు ప్రవహించినట్టుగా వణికాన్నేను అప్రయత్నంగా. ముఖపరిచయం కూడా లేని ఇద్దరు వ్యర్థంగా ప్రాణత్యాగం చేయటంలో ఏమీ అర్థం కనిపించలేదు నాకు. రామం అన్నట్టుగా క్షణికోద్రేకాలే ఈ విపరీతానికి దారితీశాయా? ఏదో మొదట మాట జారితే ఆ యువతి సవాలుచేయగానే శిరసావహించాలని ఎక్కడ వుంది? ఇది కూడా ప్రేమ కథ కిందే వస్తుందా? మరి ఆ యువతి కూడా ఎందుకు దూకింది— అతని చర్యకు చలించిపోయా లేక తనే అతని చావుకు కారకురాలు అనే భావన వల్లా? ఈ సందిగ్ధావస్థలోనుండి నేను తేరుకోకముందే మావాడు అన్నాడు.

"కాస్సేపు మాకేం బోధపడలేదు. వెర్రిగా అలాగే క్రింది నదిని చూస్తూ వుండిపోయాం..."

"అంతే?" వులిక్కిపడ్డాన్నేను.

"అవును!" నా మాటల కడ్డుపడ్డాడు రామం. "ఆ గుంపులో నేను కూడా వున్నాను."

పక్కకు తిరిగి ఎటో చూస్తూ గద్గద కంఠంతో అన్నాడు రామం, "అసలు ఆ అమ్మాయి వెళ్తూంటే 'వంతెన మీదుగా దూకమన్నా దూకు'తా అని అన్నది కూడా అతడు కాదు."

"మరి!" ఉత్కంఠను అణచుకోలేక అప్రయత్నంగా వెంటనే ప్రశ్నించాన్నేను.

మొహం పక్కకు తిప్పుకుని నెమ్మదిగా అన్నాడు రామం "...నేను!"

